సాక్షి ఒడిశా

శనివారం । 21 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు :	రూ.5,34,313
బంగారం :	2 గ్రాముల 620 మిల్లీ గ్రాములు
వెండి :	82 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



జోరు వర్షంలోనూ కలశ యాత్ర

రాయగడ జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిట సమితి స్థాయి చైతీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన కలశయాత్ర జోరువర్షంలోనూ కొనసాగింది.

- 8లో



అన్నదాత అవస్థలు

ఖరీఫ్ పంట కోతల సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

బీజేపీ కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలు

రాయగడ: బాలేశ్వర్ ఎంపీ, మాజీ కేంద్రమంత్రి ప్రతాప్ షడంగిపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ దురుసు ప్రవర్తనను జిల్లా బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ నేతృత్వంలో స్థానిక కపిలాస్ హోటల్ కూడలిలో గురువారం నిరసన చేపట్టారు. వెంటనే రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, కార్యవర్గ సభ్యులు బసంత కుమార్ ఉలక, యాళ్ల వేంకటేశ్వరరావు, కృష్ణ పట్నాయక్, మంజులా మినియాక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాదస్థలంలో గాయాలతో పాపారావు, రాజారావులు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్రగాయాలకు గురై స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ పరిధి రివల్ కొన వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి పాపారావు(34), రాజారావులు ఒక బైకుపై స్వగ్రామమైన రివల్ కొన నుంచి కల్యాణ సింగుపూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రివల్‌కొన సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రగాయాలకు గురైన పాపారావు సంఘటన స్థలం వద్దే మృతి చెందగా, రాజారావుకు గాయాలయ్యాయి.

యువ జవాన్ మృతి



ఈశ్వర్ తలియ(ఫైల్)

జయపురం: రాజస్థాన్‌లో ట్యాంకర్ పేలుడు ఘటనలో జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడకు చెందిన యువ జవాన్ ఈశ్వర తలియ మృతి చెందాడు. కెందుగుడ పంచాయతీ బొడగుడ గ్రామానికి చెందిన ఈశ్వర్ 2011లో ఆర్మీలో చేరారు. ప్రస్తుతం జమ్మూ 46 రెజిమెంట్‌లో పనిచేస్తున్నారు. బుధవారం తోటి సైనికులతో పాటు రాజస్థాన్‌లో పోక్రాన్ రేంజ్‌లో ఫైరింగ్ అభ్యసిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ట్యాంకర్‌లో బాంబు పేలుడు సంభవించింది. ఆ సంఘటనలో ప్రమాద స్థలంలో ఇద్దరు మరణించగా, ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని హెలికాప్టర్‌లో చండీఘడ్‌లోని కమాండ్ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఈశ్వర్ మృతి చెందినట్లు ఆర్మీ వర్గాలు ఈశ్వర్ కుటుంబానికి ఫోన్‌ద్వారా తెలియజేశారు. ఈశ్వర్‌కు భార్య, 8 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలకు చెదలు!



మోహానా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెదలుపడుతున్న ప్రభుత్వ పుస్తకాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు గత కొన్ని నెలలుగా పడివున్నాయి. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠ్యాంశ పుస్తకాలు పాడైపోయిన గదిలో పడవేయడంతో వచ్చే విద్యాసంవత్సరానికి పాఠ్యపుస్తకాలు ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. మోహానా ప్రభుత్వ ఉన్నత పాఠశాల 125 ఏళ్ల క్రితం నిర్మించారు. ఒకటి నుంచి ఏడోవ తరగతి గదులు ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. కొద్ది రోజుల క్రితం మోహానా సమితి అధ్యక్షుడు రాజీవ్ శోబోరో ఈ పాఠశాలను సందర్శించి కొత్త తరగతి గదులు నిర్మించాలని ఉన్నతాధికారులను కోరారు. నూతన తరగతి గదులు ఇప్పటివరకు నిర్మించలేదు. ప్రభుత్వ పుస్తకాలు ఎండకు ఎండి, వానకు తడిసి చెదలు పడుతున్నాయి. ఇప్పటికైనా డీఈఓ. మాయాధర్ సాహు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తగా.. కొంగొత్తగా..!

- శ్రీమందిరంలో సంస్కరణలు
- నూతన సంవత్సరం నుంచి అమలు
- సులభ దర్శనానికి సన్నాహాలు
- మహా ప్రసాదం సేవకులకు డ్రెస్ కోడ్

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని శ్రీమందిరంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని భారీ సంస్కరణలు చోటు చేసుకోనున్నాయి. ప్రధానంగా సులభ దర్శనం కోసం భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఈ సన్నాహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. కొత్త సంవత్సరం నుంచి తాజా సంస్కరణలతో భక్తులు, యాత్రికులకు రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాటుల సులభ దర్శనం అందుబాటులోకి రానుందని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు. అలాగే స్వామి మహా ప్రసాదం విక్రయంలో పారదర్శకత కోసం అధికార పాలన యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఆనంద బజారు ప్రాంగణంలో అనధికారిక వర్గాల చొరబాటు నివారణపై సైతం దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధీకృత వర్గాలకు సరికొత్త వస్త్రధారణ (డ్రెస్ కోడ్) ప్రవేశ పెట్టనున్నట్లు ప్రకటించారు.

ఆరు వరుసల దర్శనం

శ్రీమందిరంలో బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీజగన్నాథ స్వామి, సుదర్శనునితో చతుర్థా మూర్తులు దర్శనం సులభతరం అవుతుంది. 2025 సంవత్సరం ఆరంభం నుంచి ఆలయంలో కొత్త దర్శన విధానం అమలు కానుంది. సులభ దర్శనం కోసం ఆలయంలో 6 వరుసల్లో భక్తుల కదలికని ప్రవేశపెడతారు. తాత్కాలిక బారికేడ్లతో 6 వరుసల ర్యాంప్ ఏర్పాటు అవుతుంది. శ్రీమందిరం నాట్య మండపంలో వీటిని ఏర్పాటు చేసి వరుస క్రమంలో దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. తొక్కిసలాట లేకుండా సులభంగా స్వామివారిని కనులారా దర్శించుకునే అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మహిళలు, పురుషులు, దివ్యాంగులు, వయోవృద్ధులు, పిల్లల కోసం 6 ప్రత్యేక వరుసల గుండా దర్శనానికి అమనుతిస్తారు.

ప్రత్యేక భద్రతా సిబ్బంది

ఆలయ ప్రాంగణంలోని ఆనంద బజార్‌లో పవిత్రత పరిరక్షణ, భద్రత వ్యవస్థను మెరుగుపరిచేందుకు శ్రీజగన్నాథ ఆలయం అధికార వర్గం 20 మంది విశ్రాంత ఆర్మీ సిబ్బందిని నియమించింది. మాజీ సైనిక సిబ్బంది సాధారణ దుస్తులు ధరించి భద్రత, పవిత్రత పరిరక్షణ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు. నిత్యం 2 విడతల్లో వీరు విధుల్లో పాల్గొంటారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మరియు మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు రెండు షిఫ్టులలో పని చేస్తారు. వారి ప్రాథమిక లక్ష్యం ఆనంద బజారులో తాజా మహా ప్రసాదం అమ్మకం, సేవకుల ప్రవర్తన పర్యవేక్షణ మరియు పరిసరాల పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల్ని విరామ సైనిక సిబ్బంది నిర్వహిస్తారు. అన్న మహా ప్రసాదం మరియు పొడి మహా ప్రసాదం అమ్మకంలో పాల్గొన్న సేవకులు తమ విధుల్లో సహాయం చేయడానికి ఒక్కొక్కరిని సహాయకుడిని నియమించుకోవడానికి అనుమతిస్తారు.

ఇదీ క్రమం

మొదటి వరుసలో దివ్యాంగులు, రెండో వరుస గుండా పిల్లలతో ఉన్న మహిళలు, మూడో వరుసలో వయో వృద్ధులు, మిగిలిన మూడు వరుసల్లో పురుషులను దర్శనం కోసం అనుమతిస్తారు. ఈ మూడు వరుసల గుండా అభీష్టం మేరకు మహిళలు వెళ్లేందుకు వెసులుబాటు కల్పిస్తారు. శ్రీమందిరం నాట్య మండపంలో దర్శనం కోసం వరుసల ఏర్పాటు కార్యకలాపాల్ని ఒడిశా వంతెన నిర్మాణ కార్పొరేషన్(ఓబీసీసీ) ఆధ్వర్యంలో చేపడుతున్నారు. కలప చెక్కలతో తాత్కాలిక బారికేడ్లుతో కూడిన వరుసలు ఏర్పాటు చేస్తారు. ఉత్సవాలు వంటి సందర్భాల్లో వీటి అడ్డు తొలగించేందుకు వీలుగా ఈ ఏర్పాటు ప్రతిపాదించారు. ఈ మేరకు శ్రీమందిరం పాలక మండలి అధ్యక్షుడు పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సమక్షంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓబీసీసీ అధికారులతో సవివరంగా చర్చలు జరిపినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి తెలిపారు. దర్శనం కోసం ప్రధాన ఆలయంలో తాత్కాలిక బారికేడ్లతో కలప చెక్కల వరుసల ఏర్పాటు పురస్కరించుకుని స్వామి సేవాయత్‌ల వర్గం ఛాత్తీషా నియోగులతో సంప్రదించిన మేరకు ప్రణాళిక ఖరారు చేసి అమలు చేయడం జరుగుతుందన్నారు. మరోవైపు గరుడ స్తంభం నుంచి దర్శనం కోరుకునే వారి కోసం ప్రత్యేక ర్యాంపును నిర్మాణం యోచిస్తున్నారు. ఈ నిర్మాణం భోగ మండపం సేవలకు అంతరాయం లేకుండా ఉండేందుకు సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని పాలక మండలి అభిప్రాయపడుతోంది.

డ్రెస్ కోడ్

ఆనంద బజార్‌లో సేవకుల కోసం కొత్త డ్రెస్ కోడ్‌ను ఖరారు చేశారు. ఈనెల 25 నుంచి ఈ విధానం అమలవుతుంది. శ్రీ మందిరం సూపకార్ సేవకులకు కాషాయ రంగు వస్త్రధారణ అనివార్యం అవుతుంది. సువార్ మహాసువార్ నియోగుల సంఘం నిర్ణయం ప్రకారం మహా ప్రసాదం అమ్మకంలో పాల్గొనే సూపకార్ సేవకులు డిసెంబర్ 25 నుంచి కాషాయ రంగు దుస్తులను ధరిస్తారు.

కేంద్రమంత్రితో ఎంపీల భేటీ



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీల బృందం

భువనేశ్వర్: రాష్ట్ర ఎంపీలు కేంద్ర విద్యాశాఖ మంత్రి, సంబలపూర్ లోక్‌సభ సభ్యుడు ధర్మేంద్ర ప్రధాన్ ఆధ్వర్యంలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయడుతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు విమానయాన సౌకర్యాల సంబంధిత ప్రతిపాదనలతో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు, కొత్త టెర్మినల్స్, విమానాశ్రయ విస్తరణ, అనుసంధాన నిర్మాణాలు, ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలని అభ్యర్థించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవన నిర్మాణం, ఝార్సుగుడ వీర సురేంద్ర సాయి విమానాశ్రయం రెండో దశ పునరుద్ధరణ, రౌర్కెలా, జయపురం ఎయిర్‌స్ట్రిప్‌ల విస్తరణ, బొలంగీర్‌లోని తుషురా ఎయిర్‌స్ట్రిప్ పునరుద్ధరణ, పూరీలో కొత్త విమానాశ్రయం ఏర్పాటు, కటక్ చరబటియా ఏఆర్‌సీ పూర్తి స్థాయి పౌర విమానయాన ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, ప్రతిపాదనలతో వినతి పత్రం అందజేశారు. ఢెంకనాల్ ప్రాంతంలో బిరాసల్, సంబల్‌పూర్‌లో హిరాకుద్, గంజాం జిల్లాలో రొంగైలుండా, జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్, కలహండిలోని ఉత్కెలా, జాజ్‌పూర్‌లో కళింగ నగర్, కెంజొహర్‌లో రాయిసువాన్, బర్‌గఢ్ జిల్లా పదంపూర్, మయూర్‌భంజ్ జిల్లా రాస గోబింద్‌పూర్, రాయిరంగపూర్‌లోని విమానాశ్రయాలను ఉడే దేశ్ కీ ఆమ్ ఆద్మీ (ఉడాన్) పథకంలో చేర్చాలని విన్నవించారు.

నిరంజన్ పట్నాయక్ ఇంటిపై ఈడీ దాడులు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈడీ దాడులు ముమ్మరం అవుతున్నాయి. శుక్రవారం ఉదయం ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడి చేసింది. స్థానిక నయాపల్లి ప్రాంతంలో నిరంజన్ పట్నాయక్ ఇల్లు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న అతని బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏకకాలంలో ఈడీ దాడులు చేపట్టినట్లు సమాచారం. ఉదయం సుమారు 7 గంటల నుంచి ఆరంభమైన దాడులు నిరవధికంగా 4 గంటలపాటు సాగినట్లు తెలుస్తోంది. దాడుల వివరాలు బయటకు పొక్కనీయకుండా అనుబంధ వర్గాలు జాగ్రత్త వహించాయి. ఈ మేరకు నిరంజన్ పట్నాయక్ కూడ పెదవి కదపకుండా దాటవేశారు. 8 నుంచి 10 మంది సభ్యులతో కూడిన ఈడీ బృందం దాడులు చేపట్టింది. నిరంజన్ పట్నాయక్ ఇంటిలో ఈ వర్గాలు సోదాలు చేపట్టినట్లు సమాచారం. ఇంతకు ముందు ప్రధాన ప్రతిపక్షం బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ సోదరుడు ఖిరోద్ మల్లిక్ ఇంటిపై ఈడీ దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో రూ.231 కోట్ల ఆర్థిక లావాదేవీలపై ఈడీ వర్గాలు సందేహం వ్యక్తం చేసి అనుబంధ దస్తావేజులు ఇతరేతర సంబంధిత వివరాలను హస్తగతం చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రెండు రోజులపాటు ఈడీ ఖిరోద్ మల్లిక్ ఇళ్లపై దాడులు నిరవధికంగా కొనసాగించింది.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ

జయపురం: విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ అన్నారు. జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ ఆదర్శ విద్యాలయ వార్షికోత్సవంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి దానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యా సంవత్సరం ఉత్తమ విద్యార్థిగా నిలిచిన ఆయుష్‌ స్వైను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జయపురం విక్రమదేవ్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్, బొయిపరిగుడ బీడీవో అభిమన్యు కవి శతపతి, బ్లాక్ విద్యాధికారి సుకాంత కర్మీ, సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త, నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి నరేంద్ర కందాలియ, కొరాపుట్ నోడల్ విద్యాలయ అధ్యక్షుడు శౌశాంఖ శేఖర చౌదరి, పాఠశాల అధ్యక్షుడు శశి భూషణ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై ఫిర్యాదు



గవర్నర్ రఘుబర్ వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

భువనేశ్వర్: పార్లమెంట్ ఆవరణలో జరిగిన తోపులాటలో బాలాసోర్ లోక్‌సభ సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగిని తోసిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు భారత రాష్ట్రపతిని ఉద్దేశించిన వినతిపత్రం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌కు శుక్రవారం అందజేశారు.

విస్తారంగా వర్షాలు



భువనేశ్వర్: దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల గురువారం రాత్రి నుంచి వర్షం ప్రారంభం కాగా, ఇతర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి వానలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. ఇదే వాతావరణ పరిస్థితి మరో 2 రోజులపాటు నిరవధికంగా కొనసాగే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వాతావరణ శాఖ ఐఎండీ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 19 జిల్లాలకు ఐఎండీ ప్రత్యేక హెచ్చరికలు జారీ చేసింది. వివిధ ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఈ కేంద్రం సమాచారం.

పంటలపై ప్రభావితం

రాష్ట్రంలో అకాల వర్షాలు మరోసారి పంటలపై విపరీత ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో పొలాల్లో పంటని ముందస్తు జాగ్రత్త చర్యలతో సంరక్షించుకోవాలని వాతావరణ కేంద్రం సూచించింది. కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో సాధారణ జన జీవనం ప్రభావితం అయింది.

పెరిగిన చలి

బంగాళాఖాతంలో వాతావరణ మార్పు ప్రభావంతో శుక్రవారం నుంచి చలి తీవ్రత పెరిగింది. తాజా వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మరో 4 రోజులపాటు చలి గాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం సమాచారం.

ప్రభావిత జిల్లాలు

కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, నవరంగపూర్, కలహండి, కంధమల్, నువాపడా, బొలంగీరు, సోన్‌పూర్, అంగుల్, ఢెంకనాల్, కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షంతో ప్రభావితం అవుతాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

4 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

గంజాం, గజపతి, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్ష సూచన జారీ అయింది.

రాజధానిలో తగ్గిన ఉష్ణోగ్రత

రాజధాని నగరం భువనేశ్వర్‌లో శుక్రవారం పగటి పూట వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో వాతావరణం 26.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి వాతావరణంలో 8.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత దిగజారి 18.2 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం అయింది.

బోండా గిరిజనుల సంక్షేమానికి కృషి

- డిప్యూటీ సీఎం ప్రభతి పోరిడా



బోండాజాతి మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ప్రభాతి పోరిడా

మల్కన్‌గిరి: బోండాజాతి గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రభతి పోరిడా అన్నారు. మల్కన్‌గిరి జిల్లా ఖోయిపుట్ సమితిలోని రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రభతి పోరిడా శుక్రవారం పర్యటించారు. తొలిసారిగా ఈ ప్రాంతానికి వచ్చిన ఆమె మల్కన్‌గిరి జిల్లాలో భూమికి ఆరు వేల అడుగుల ఎత్తులో ఉన్న బోండ ఘాటీలో పర్యటించారు. అధిమ గిరిజనులు నాలుగు వేలు మంది ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఈ తెగకు చెందిన గిరిజనులు ముదిలీపోఢ, ఆంద్రాహాళ్ నివసిస్తున్నారు. ముఖ్యంగా బోండా గిరిజనులకు బ్యాంక్ ఖాతాలు లేవని తెలుసుకున్న డిప్యూటీ సీఎం త్వరలోనే వారికి బ్యాంకు పుస్తకాలను సమకూర్చి సుభద్ర పథకం ద్వారా నిధులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బోండ మహిళాలు తయారు చేస్తున్న పూసలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ ఈ ప్రాంతాంలో సంబంధిత పరిశ్రమను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. ఈ విషయమై అధికారులతో చర్చించారు. బోండా గిరిజనలు అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. విద్యపై ఆసక్తి చూపాలన్నారు. బోండా మహిళలు తయారు చేసిన పూసలదండలను ధరించి డీప్యూటీ సీఎం నృత్యం చేశారు. ప్రధానమంత్రి గృహ యోజన పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న గిరిజనలకు అదరంగా మరో 50 వేల రూపాయలను అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురికి భూ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుభీలో, జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీతాకూండ , పూసుగూడ గ్రామాల్లో డిప్యూటీ సీఎం పర్యటించారు.



గిరిజన మహిళకు భూపట్టాను అందజేస్తున్న ప్రభాతి పోరిడా



డిప్యూటీ సీఎం నుంచి పట్టాలు అందుకుంటున్న గిరిజనులు

క్లుప్తంగా

పీజీ సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వర్సిటీలో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులతో ల్యాబుల్లో పరీక్షలు రాస్తున్నట్లు సైతం ప్రచారం జరుగుతోంది. ఇన్విజిలేషన్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అప్పగించగా, వారు నాన్ టీచింగ్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించి వారి వ్యక్తిగత పనులు చూసుకుంటున్నట్లు సమాచారం. దీంతో మాస్ కాపీయింగ్ జరుగుతోంది. పలువురు విద్యార్థులు సైతం ఈ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ వద్ద ఈ విషయం ప్రస్తావించగా, చూసి రాతలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇన్విజిలేటర్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధన సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. బీటీ, సీసీ రోడ్లు, తదితర పనులు వర్షాలు తగ్గిన వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం సమీక్షిస్తానన్నారు. సమస్యలు ఉంటే చెప్పాలన్నారు.

31 వరకు ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: 2025–26 విద్యా సంవత్సరానికిగాను కొత్తగా ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు, పాఠశాలల అప్‌గ్రెడేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసే ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య లేదా అప్పటికే నడుస్తున్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను బట్టి లేదా అవసరాన్ని బట్టి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని డీఈఓ పేర్కొన్నారు. ఏపీ పాఠశాల విద్య డైరెక్టర్ అమరావతి వారి దేశాల మేరకు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో నిర్దేశించిన నిబంధనల ప్రకారం వివరాలు సమర్పించాలన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల్లో సృజనను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలసి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజును అధికారులు సత్కరించారు.

తడిసిన ధాన్యం కొంటాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా అంతటా వానలు పడుతున్నందున వరి నష్టపోకుండా జాగ్రత్తలు చేపట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. వర్షాల వల్ల ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తడిసి ముద్దయిన, రంగు మారిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట నియోజక వర్గాల పరిధిలో పొలాల్లో ధాన్యం ఉందని, వాటిని సంరక్షించుకోవాలన్నారు. శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తెలకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన తల్లీకుమార్తెలు చంద్రకళ, మౌనిక

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై స్కూటీపై వెళ్తుండగా శుక్రవారం కారు ఢీ కొట్టటంతో తల్లీకుమార్తెలు యతిరాజుల చంద్రకళ, కుమార్తె మౌనిక గాయపడ్డారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస నవోదయ పాఠశాలలో కుమార్తె 10వ తరగతి చదువుతోంది. ఆమెను స్వగ్రామం కేశవరావుపేటకు తీసుకువచ్చేందుకు తల్లి స్కూటీపై వెళ్లింది. ఇద్దరూ బండిపై వస్తుండగా నవభారత్ నుంచి కింతలి మిల్లు వైపు సర్వీస్ రోడ్డుపై నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే క్రమంలో కొయ్యరాళ్ల కూడలి సమీపంలో కారు వీరి బండిని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తల్లీకుమార్తెలు రోడ్డుపై పడిపోయారు. ఇద్దరికీ చిన్న దెబ్బలే తగలడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు నంబర్ ప్లేట్ రోడ్డుపై పడిపోవటంతో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్‌కు వాట్సాప్‌లో స్థానిక ప్రయాణికులు ఫొటో పంపించారు. అనంతరం 108లో శ్రీకాకుళం రిమ్స్‌లో క్షతగాత్రులు చేరారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటిని వృథా చేయొద్దు


పాణి పంచాయతీ పోటీల్లో ప్రసంగిస్తున్న చీఫ్ ఇంజినీర్ శివ ప్రసాద్ పాణిగ్రహి

జయపురం: జయపురం ఉన్నత పాఠశాలలో సాగునీటి ప్రాజెక్టు విభాగం పాణి పంచాయతీ పక్షం దినోత్సవాల సందర్భంగా శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అప్పర్‌కొలాబ్ సాగునీటి ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శివ ప్రసాద్ పాణిగ్రహి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవరాసుల మనుగడకు అవసరమైన నీటిని వృథా చేయవద్దన్నారు. కెనాల్‌ల ద్వారా పంట భూములకు అందిస్తున్న సాగునీరు వృథా కాకుండా పాణీ పంచాయతీలు ప్రధాన భూమిక నిర్వహిస్తాయన్నారు. గౌరవ అతిథిగా ఎస్‌ఈ నీలమణి జ్ఞానచంద్ హర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంభు ప్రసాద్ సాహు, జూనియర్ ఇంజినీర్ మాధవానంద శతపతి, దీపక్ కుమార్ బెహర, జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన కుమార్ నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా చిత్ర లేఖన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శర్మిష్ఠ భుయ, శారదా విహార్ సరస్వతీ శిశుమందిర విద్యార్థి అశిస నాయక్, రొండాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి భారతీ ఖొటి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వక్తృత్వ పోటీల్లో సునారీ వీధి నూతన ప్రాథమిక పాఠశాల విద్యార్థి టి.అర్పిత పాత్రో ప్రథమ బహుమతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖీరసొందు సాహు ద్వితీయ, అరవిందనగర్ సరస్వతీ శిశుమందిర విద్యార్థి రుతి పాల్ తృతీయ బహుమతులు పొందారు. క్విజ్ పోటీల్లో సరస్వతీ విద్యాలయ విద్యార్థి మానశ్రీ హరిజన్, శారదా విహార్ సరస్వతీ శిశు మందిర విద్యార్థి సుజిత్ సాహు, జయపురం సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థి అమిత్ కుమార్ యాదవ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. చిత్ర లేఖన పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గాయిత్రీ పట్నాయక్, శారదా విహార్ సరస్వతీ శిశుమందర విద్యార్థి శుభశ్మిత దాస్, పూజారిపుట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కనక పూజారి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుతులు పొందారు. నమూనా ప్రదర్శన ఎకంబా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రితు హరిజన్ ప్రథమ, ప్రియ నాయక్ ద్వితీయ, శుభం పండా, ఆదిత్య పాణిగ్రహి తృతీయ బహుమతులు సాధించారు. ఈ పోటీల్లో విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.


నమూనా పోటీల్లో విజేతలు


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు


అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ శ్రేణులు

జయపురం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణమే పదవికి రాజీనామా చేయాలని కమ్యూనిస్టు సీపీఐ కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం జయపురం 26వ జాతీయ రహదారి పారాబెడ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలను దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి అన్నారు. సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆందోళనలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో, సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, నిత్యానంద పాత్ర, సుందర హరిజన్, ధ్రుభ మల్లిక్, బసంత బెహర పాల్గొన్నారు.

సామాజిక సందేశాన్నిచ్చిన 'విరామం'


ఒబొసారొ నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

భువనేశ్వర్: జీవిత చరమాంకంలో అవిరామ పోకడతో నలిగిపోతున్న వయో వృద్ధుల కష్టాల ఇతివృత్తంతో రూపొందిన ఒడియ నాటకం ఒబొసారొ (విరామం) విశేషంగా ప్రేక్షక ఆదరణ పొందుతుందని నటీనటులు, దర్శక, నిర్మాతలు, ఇతర సాంకేతికవర్గం ఆనందం వ్యక్తం చేశారు. దేవ్‌గఢ్ జాగరణ్ ఆర్ట్ ఇంటర్నేషనల్ నిర్వహించిన 20వ అఖిల భారత బహుభాషా నాటక, నృత్యోత్సవం – 2024లో ఒబొసారొ నాటకం విశేష ప్రేక్షక ఆదరణ నాటకంగా గుర్తింపు పొందింది. నేటితరం కుటుంబ జీవనం ఆధారిత కథనంతో రంగస్థలంపై ఒబొసారొ నాటకం కుటుంబంలోని వృద్ధుల పట్ల కుటుంబీకుల నిర్లక్ష్యం పరిణామాల్ని ప్రదర్శించింది. ఈ అమానుష అధునాతన కుటుంబ జీవన పోకడ సంస్కరించుకుని వయో వృద్ధులపై ఆదరాభిమానాలతో నిండు నూరేళ్ల పెద్దలకు ప్రశాంత జీవనం ప్రసాదించాలనే సందేశాన్ని సమాజానికి ప్రసారం చేసింది. హర్ బారిక్ రచించిన ఈ నాటకానికి హరేన్ సాహు దర్శకత్వం వహించారు. ముక్తి కాంత్ మహాపాత్రో, నటబర ఆచార్య, రఘునాథ్ బెహరా, జ్ఞానేంద్ర శత్పతి, మహేంద్ర శత్పతి, దీపక్ మహాపాత్రో, వ్యాసదేవ్ చౌహాన్, అభిమన్యు సెఠి, తపస్ దాస్, మమతా మహంతి, శ్వేతా రథ్, రాజలక్ష్మి మిశ్రా, బాలనటుడు అభిమాన్ సాయి వివిధ పాత్రల్లో నటించారు.

చైతీ ప్రారంభోత్సవాలు రద్దు


ఉత్సవ వేదిక


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సహోట

రాయగడ: ఇడితాల్ పేరిట గుణుపూర్‌లో నిర్వహిస్తున్న సమితి స్థాయి చైతీ ప్రారంభోత్సవాలు వర్షం కారణంగా రద్దు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా ఎంతో ఘనంగా చైతీ ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ ఎడతెరిపి లేని వర్షం కారణంగా కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. మూడు రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం వర్షం పరిస్థితిని అంచనా వేసి ఉత్సవాలను కొనసాగిస్తామన్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

కాశీబుగ్గ: చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ పలాస సివిల్ కోర్టు జడ్జి యు.మాధురి గురువారం తీర్పు ఇచ్చారు. శ్రీరామ్ చిట్స్ పలాస బ్రాంచ్‌కి బకాయి నిమిత్తం పలాసకి చెందిన తంగుడు శ్రీధర్ రూ.1,47,000కు చెక్ ఇచ్చారు. ఈ చెక్ తీసుకొని చిట్స్ యాజమాన్యం బ్యాంక్‌కు వెళ్లగా బౌన్స్ అయిందని సంబంధిత అధికారులు తెలిపారు. కంపెనీని శ్రీధర్ మోసం చేశాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో పలాస జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్‌ఫస్ట్ క్లాస్ న్యాయ అధికారి విచారణ జరిపారు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడికు ఆరు నెలల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

చివరి రోజు క్రీడలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన అంతర్ పాలిటెక్నిక్ ప్రాంతీయ క్రీడలు శుక్రవారం ముగియాల్సి ఉండగా, వానల కారణంగా వాయిదా పడ్డాయి. శుక్రవారం వర్షం కారణంగా ఆటలు ప్రారంభం కాలేదు. దీంతో ముగింపు కార్యక్రమం వాయిదా పడింది. వాన లు తగ్గిన తరువాత విద్యార్థులకు సమాచారం ఇస్తామని, చివరి రోజులు క్రీడలు నిర్వహణ, ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకి రామయ్య శుక్రవారం తెలిపారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

అరసవల్లి: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఈమేరకు ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యుత్ పొదుపు అవగాహనపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు.

• అన్నదాత అవస్థలు


గురండి వద్ద కళ్లంలోని ధాన్యాన్ని ఇంటికి తరలిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఖరీఫ్ పంట కోతల సమయంలో బంగళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో జిల్లాలోని కాశీనగర్, గుసాని సమితుల్లో వర్షం పడటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ నెల 19 సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. ఈ నెల 21కి వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయని ఐ.ఎం.డీ. మాజీ డైరెక్టర్ శరత్ చంద్ర పాత్రో తెలియజేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయలేదు. డిసెంబర్ 30 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు (మండీలు) ప్రారంభిస్తామని అంటున్నారు. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దాయ్యాయి. రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారో, తిరస్కరిస్తారో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులున్నారు. ఈ నెల 27 వరకు చలి ఓ మోస్తరుగా ఉంటుందని, ఈ నెల 23 నుంచి 25 వరకు ఉత్తర ఒడిశా ప్రాంతాలైన కియోంఝర్, జాజ్‌పూర్, డెంకనాల్, మయూర్‌భంజ్, బాలసోర్, భద్రక్‌లలో చలిగాలులు వీస్తాయని శరత్ చంద్ర పాత్రో తెలియజేశారు. డిసెంబరు 22, 23 తేదీలలో గంజాం, గజపతి జిల్లాల్లో చలి ఓ మాదిరిగా ఉంటుంది.

యువకుడు అనుమానాస్పద మృతి


అట్టాడ మురళి


చెట్టుకు వేలాడుతున్న యువకుడు మురళి మృతదేహం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడాం గ్రామంలో శుక్రవారం ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. గ్రామ సమీపంలోని చెట్టు వద్ద ఉరికి వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని చినబడాంకు చెందిన అట్టాడ మురళి(26)గా గుర్తించారు. పోలీసులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. మురళి, అదే గ్రామానికి చెందిన అక్షయ అనే అమ్మాయి ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అక్షయ తల్లిదండ్రులు వీరి వివాహానికి ఒప్పుకోకపోవడంతో వీరిద్దరూ ఇళ్ల నుంచి పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏడాది పా టు సాఫీగా సాగిన వీరి దాంపత్య జీవితంలో కొద్ది రోజులు కిందట కలహాలు ఏర్పడ్డాయి. గర్భం దా ల్చిన అక్షయ భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయని మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. భార్య అక్షయ, ఆమె తల్లిదండ్రులు ఇటీవల మురళితో గొడవపడ్డారని, తప్పుడు కేసులు కూడా పెట్టారని వారు పోలీసులకు వివరించారు. భార్య మురళిని వేధించేదని, ఆమె తీరుపై మురళి తీవ్రంగా మనస్తాపం చెందేవాడని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భార్య తరపు వారే చంపేసి గ్రామంలోని ఎగువ చెరువు గట్టుపై చెట్టుకు ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్ఐ చంద్రరావు వెల్లడించారు.

ఢీకొట్టి పరారైన ఆటో

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డు లో ఉన్న శ్రీనివాస కూడలి వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ వృద్ధుడు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో అతివేగంగా వచ్చి ఆయనను బలంగా ఢీకొట్టింది. వృద్ధుడు గాయాలతో రోడ్డుపై పడిపోవడంతో ఆటో డ్రైవర్ పరారైపోయాడు. క్షతగాత్రుడిని పలాస మండలం చిన్నమాకన్నపల్లి గ్రామానికి చెందిన జుత్తు కామేషుగా గుర్తించారు. స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఢీ కొట్టి పరారైన ఆటోకు సంబంధించిన సీసీ ఫుటేజీలు కాశీబుగ్గ పోలీసులు సేకరిస్తున్నారు.

జోరు వర్షంలోనూ కలశ యాత్ర


కలశ యాత్రలో పాల్గొన్న సబ్ కలెక్టర్ సహోట, చంద్రధ్వజ పండా, తదితరులు


ఆదివాసీ నృత్యాలతో విద్యార్థులు


సంప్రదాయ ఆదివాసీ నృత్యాలు


చైతీ రథం

రాయగడ జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిట సమితి స్థాయి చైతీ ఉత్సవాలో భాగంగా శుక్రవారం జరిగిన కలస యాత్ర జోరు వర్షం మధ్య కొనసాగింది. జగన్నాథ మందిరం నుంచి ప్రారంభమైన కలశ యాత్ర తహసీల్దార్ కార్యాలయం వెనుక గల ఉత్సవ వేదిక వరకు జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు, సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్, కమిటీ కన్వీనర్ డాక్టర్ చంద్ర ధ్వజ పండా, బీడీఓ శుభ్రాంజలి ప్రదాన్, తహసీల్దార్ లీలావతి ఆచార్య, ఎన్‌సీసీ క్యాడేట్లు, వివిధ పాఠశాలల, కళాశాలలకు చెందిన విద్యార్థులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, లంజియ సవర ఆదివాసీ తెగకు చెందిన ఆదివాసీలు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే వస్త్రాలతో కలశ యాత్రలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడు రోజుల పాటుగా ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. – రాయగడ


కలశ యాత్రలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

పైడితల్లికి స్వర్ణపుష్పార్చన



స్వర్ణపుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి మార్గశిరమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని స్వర్ణపుష్పార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహించారు. సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తరించారు.

పొలాల్లోకి దూసుకు పోయిన ఒడిశా బస్సు



పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు

గజపతినగరం: మండలంలోని మధుపాడ గ్రామం సమీపంలో ఒడిశా ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకు పోయింది. శుక్రవారం ఉదయం జరిగిన సంఘటన వివరాల్లోకి వెళ్తే ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోయి అదుపు తప్పి గజపతినగరం మండలం మధుపాడ గ్రామం సమీపంలో జాతీయ రహదారి పక్కన పొలాల్లోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సును జేసీబీ ద్వారా బయటకు తీశారు.

గిరిజన సంక్షేమాధికారిగా కె.శ్రీనివాసరావు



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారిగా కె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకు సాలూరు సహాయ గిరిజన సంక్షేమాధికారిగా బాధ్యతలను నిర్వహిస్తూ ఇక్కడ డీటీడబ్ల్యూఓగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌ను, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. అలాగే గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

విజయనగరం టౌన్: హిందూ పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభను జనవరి 5న విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం వద్ద, కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధి సీహెచ్‌వీ.రమణమూర్తి, ఎం.గణపతిరావులు తెలిపారు. ఈ మేరకు విజయనగరంలోని కోటవద్ద ఉన్న కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కరపత్రాలు, పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ హైందవ శంఖారావంలో భాగంగా ఈ నెల 22న విజయనగరం జిల్లా కేంద్రంలో 20 ప్రాంతాల్లో హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. చలో విజయవాడకు విజయనగరం జిల్లా నుంచి మూడురైళ్లు, 25 బస్సులు, 100 కార్లు, టూవీలర్స్ ద్వారా హిందూ బంధువులందరూ హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో టౌన్ కన్వీనర్ పి.ఉమాశంకర్, తోట శ్రీధర్ బాబు, జీవీ.వెంకటపతిరాజు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాదముద్రలు పులివికావు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామ పొలాల్లో జంతువు పాదముద్రలను కొందరు రైతులు గమనించారు. పులి పాదముద్రలుగా అనుమానించి పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. సమాచారం అందుకున్న విజయనగరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.సుబ్బారావు, బీట్ ఆఫీసర్ రామారావు శుక్రవారం పొలాలను సందర్శించి పాదముద్రలను పరిశీలించారు. పులివి కావని, ఇవి పెద్ద నక్క, లేదంటే దుమ్మలగుండు పాదముద్రలు అయి ఉండవచ్చని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు కనం..!

- పేరుకే అంతరరాష్ట్ర మార్కెట్
- చినుకు పడితే చిత్తడే
- కుళ్లిన వ్యర్థాలతో వినియోగదారుల అవస్థలు
- రోజూ సుమారు రూ.25 లక్షలు లావాదేవీలు
- కనీస సౌకర్యాలకు నోచుకోని మార్కెట్
- ఇక్కట్లు పడుతున్న రైతులు, వ్యాపారులు
- పట్టించుకోని పంచాయతీ, మార్కెటింగ్ అధికారులు



బురదమయంగా ఉన్న రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్



పరదాలతో ఏర్పాటు చేసిన షెడ్లలో కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

రామభద్రపురం: జిల్లాలో అతిపెద్దదైన రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ అనేక సమస్యలతో సతమతమవుతోంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కనీస అభివృద్ధికి నోచుకోలేదు. చినుకు పడితే మార్కెట్ అంతా చిత్తడిగా మారుతోంది. దీంతో కొనుగోలుదారులు, రైతులు, వినియోగదారులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ అభివృద్ధి చేపట్టకపోవడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మార్కెట్‌కు ప్రతిరోజూ రామభద్రపురం మండలంతో పాటు బొబ్బిలి,గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బాడంగి, తెర్లాం సాలూరు, మక్కువ తదితర మండలాలకు చెందిన సుమారు 3వేల మంది రైతులు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు.అలాగే ఈజిల్లాకు చెందిన వ్యాపారులతో పాటు విశాఖపట్నం, శ్రీకాకులం, రావులపాలెం , రాజమండ్రి, విజయవాడ, ఇతర రాష్ట్రాలైన ఒడిశా, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లకు చెందిన వారు సుమారు 200 మంది వ్యాపారులు ఈ మార్కెట్‌లో కొనుగోలు చేసి వ్యాన్‌లు, బస్సులపైన రవాణా చేస్తుంటారు. ఈ మార్కెట్‌లో ప్రతిరోజూ సుమారు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. అలాగే రోజూ చిరు వ్యాపారులు సుమారు 100 మంది వరకు మార్కెట్‌పై ఆధారపడి జీవనోపాధిపొందుతున్నారు. కూరగాయలు రిటైల్‌గా విక్రయిస్తున్న చిరు వ్యాపారులు ఒక్కో షెడ్డుకు రోజుకు రూ.50 నుంచి రూ.300 వరకు ఆసీలు చెల్లిస్తున్నారు.దీని ద్వారా ఏడాదికి పంచాయతీకి సుమారు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ, మార్కెటింగ్ అధికారులు నిర్లక్ష్యం చూపడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఎండ, వానకు రైతులు, వ్యాపారులు తలదాచుకునేందుకు నిలువనీడలేక ఇబ్బంది పడాల్సిందే. వర్షం పడితే మార్కెట్ అంతా బురద మయమవుతుంది. ఆ బురదలోనే నిత్యం రైతులు, వ్యాపారులు కార్యకలాపాలు జరపాలి తప్ప గత్యంతరం లేని పరిస్థితి ఉంది. రోజూ కురుస్తున్న కొద్దిపాటి వర్షానికి మార్కెట్ అంతా బురదమయం అవడంతో కూరగాయలు విక్రయానికి తెచ్చిన రైతులు కింద దించలేక తలపై ఉంచలేక నానా అవస్థలు పడుతుండగా కూరగాయలు కొనేందుకు బురదలో రైతుల వద్దకు వెళ్లేందుకు వ్యాపారులు అసహనం చూపుతున్నారు. పంచాయతీ అధికారులు రోజు వారీ నిర్వహణ సక్రమంగా లేక కూరగాయల వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సరైన సదుపాయాలు లేక ఆరికతోట, చొదంతివలస, మెంటాడ, దత్తిరాజేరు వంటి గ్రామాలనుంచి వచ్చిన రైతుల సంఖ్య తగ్గుతోంది. వారు అక్కడి నుంచే వేరే ప్రాంతాలకు తీసుకుపోయి విక్రయించుకుంటున్నారు. అలాగే కొనుగోలు దారులు పెద్దగా రావడం లేదని రైతులు చెబుతున్నారు. వర్షం పడితే మార్కెట్‌కు కూరగాయలు తెచ్చి బురదలో విక్రయించేందుకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి ఆసీల రూపంలో ఆదాయం జాస్తిగా వస్తుంది కానీ సౌకర్యాల మెరుగుకు అధికారులు చొరవ చూపడంలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

కూరగాయల తట్ట దించాలంటే ఇబ్బందిగా ఉంది..



చిన్నపాటి వర్షం పడిందంటే చాలు.కూరగాయల మార్కెట్‌కు ఇబ్బందిపడుతూ రావాల్సి వస్తోంది. మార్కెట్ అంతా బురదమయంగా ఉడడంతో కూరగాయలు విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. తలపై ఉన్న కూరగాయల తట్ట నేలపై దించి, వ్యాపారి కొనుగోలు చేసిన తరువాత మళ్లీ తట్ట తలపై పెట్టుకుని వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఆసీలు వసూలు చేసేందుకు ఉన్న శ్రద్ధ సౌకర్యాలు మెరుగుకు పంచాయతీ అధికారులు చూపడం లేదు. దీంతో రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

పూడి సత్యం,కూరగాయల రైతు

రైతులు తిడుతున్నారు..



వర్షం పడితే మార్కెట్ చిత్తడిగా మారడంతో రైతులు కూరగాయలు విక్రయించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు విక్రయించిన తరువాత ఆసీలు చెల్లించడానికి వచ్చినప్పుడు రైతులు ఆసీలు వదలకుండా తీసుకుంటారు కానీ మార్కెట్‌ను శుభ్రపరచరు, బురదలో కూరగాయలు ఎలా అమ్మమంటారని ప్రశ్నిస్తూ తిడుతున్నారు. మేము ఈ ఏడాది రూ.35 లక్షల పైబడి మార్కెట్ ఆసీలు వసూలు చేసేందుకు పాట పాడాం. ఆ నిధులు విడతలువిడతలుగా పంచాయతీకి చెల్లిస్తున్నాం. రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి పలుమార్లు అధికారులు దృష్టిలో పెట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

కనిమెరక సూర్యనారాయణ, ఆసీల వసూలుదారు

సమస్య పరిష్కారానికి చర్యలు



త్వరలో మార్కెట్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. మార్కెట్ అంతా సీసీ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. తాత్కాలికంగా రాయి బుగ్గి వేస్తాం, అలాగే మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడతాం

శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో, రామభద్రపురం



మార్కెట్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన(ఫైల్)

శంకుస్థాపనకే ఎమ్మెల్యే పరిమితం

రామభద్రపురం కూరగాయల మార్కెట్ అభివృద్ధికి స్థానిక నాయకులు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అక్టోబరు 7వ తేదీన శంకుస్థాపన చేశారు. రెండు నెలలు దాటుతున్నా ఇప్పటికీ కనీసం పట్టించుకోలేదు.

క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యంతో క్రీడా పాలసీ

- అమరావతిలో 2027 జాతీయ క్రీడలను నిర్వహించేందుకు సన్నాహాలు
- రాష్ట్ర రవాణా, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మల్టీపరపస్ ఇండోర్ హాల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రులు



ప్రారంభోత్సవం అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రులు

విజయనగరం: రాష్ట్రంలో క్రీడారంగాన్ని ప్రోత్సహించడం ద్వారా క్రీడాంధ్ర ప్రదేశ్‌గా రూపొందించే లక్ష్యంతో దేశంలోనే అత్యుత్తమ క్రీడాపాలసీని తీసుకువచ్చినట్లు రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో క్రీడాకారుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా అన్ని ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు, స్టేడియంలు, అకాడమీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ హాల్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్జీ స్టేడియంలోని మల్టీ పర్పస్ ఇండోర్ హాల్‌లో మంత్రులు రాంప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతి, కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్, శాప్ ఎం.డి గిరీశ తదితరులు కాసేపు షటిల్ ఆడారు. జిల్లాకు చెందిన క్రీడాకారులతో మంత్రులు, అధికారులు ముచ్చటించారు. ఈ సందర్భంగా క్రీడా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న 2 శాతం రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచినట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయి వరకు పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే జాతీయ క్రీడలను 2027లో అమరావతిలో నిర్వహించేందుకు ప్రణాళికా బద్ధంగా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

యువతకు క్రీడలు ముఖ్యం

రాష్ట్ర చిన్న పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ. వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యలో క్రీడలను భాగంగా చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. యువతకు క్రీడలు ఎంతో ముఖ్యమని వారిని క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో శాప్ ఎం.డి. గిరీశ, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఎస్‌డీఓ వేంకటేశ్వర రావు, డిప్యూటీ రవాణా కమిషనర్ మణికుమార్, రవాణా శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే వెల్ఫేర్ డే



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలు ఎస్పీ తెలుసుకుని విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

క్యాన్సర్ అస్పత్రి ఏర్పాటు ఉత్తరాంధ్రకు మేలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్




ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి శ్రీనివాస్ తదితరులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ (యుఎస్‌వి) సాయంతో నిర్మాణం చేసిన 100 పడకల క్యాన్సర్ ఆస్పత్రి ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.నిర్మాణం పూర్తయిన ఆస్పత్రిని శృంగవరపుకోట, విజయనగరం ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, అదితి గజపతిలతో కలిసి మంత్రి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జామి మండలానికి చెందిన ఉప్పలపాటి వెంకటపతిరాజు సుమారు 40 సంవత్సరాల క్రితం అమెరికా వెళ్లి స్థిరపడి ఈ ప్రాంత ప్రజలపై మమకారంతో గురుదేవ చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలపై అపారనమ్మకంతో ఈ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించి తనతో ప్రారంభింప చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు, ఈ ఆస్పత్రి ఉత్తరాంధ్ర ప్రజలకే కాకుండా దేశంలో ఉన్న క్యాన్సర్ బాధితులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అభిప్రాయపడ్డారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ ఈ అస్పత్రి నిర్మాణానికి ఉప్పలపాటి మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉప్పలపాటి వెంకటపతిరాజు రూ.15 కోట్ల వరకు సాయం అందించారని తెలిపారు. ఆస్పత్రిలో అత్యాధునిక కీమోథెరపీ, ఐసీయూ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని, అతి తక్కువ ధరలకే క్యాన్సర్ రోగులకు చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఉప్పలపాటి మెమోరియల్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ గొయ్యిలో పడి బాలుడి మృతి

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్డికి సంబంధించి సెప్టిక్ ట్యాంక్ కోసం తీసిన గొయ్యిలో ఓ బాలుడు తూరిబిల్లి దుశ్వంత్ (2.6) ప్రమాదవశాత్తు పడి శుక్రవారం మృతి చెందాడు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో పెళ్లివేడుక జరుగుతుండగా బాలుడు ఆటుకుంటూ వెళ్లి గోతిలో పడిపోయాడు. గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి గొయ్యి పూర్తిగా నీటితో నిండిపోయింది, బాలుడు ఎంతకీ కనిపించకపోవడంతో వెతకగా చివరికి గొయ్యిలో విగత జీవిగా కనిపించాడు.

సీతంపేటలో నీతి అయోగ్ బృందం



అడ్వెంచర్ మూవీ చూస్తున్న నీతి అయోగ్ బృంద సభ్యులు



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న నీతి అయోగ్ అధికారులు

సీతంపేట: స్థానిక అడ్వెంచర్ పార్కును నీతి అయోగ్ బృందం శుక్రవారం సందర్శించింది. పార్కులో ఏర్పాటు చేసిన వివిధ సాహసక్రీడల్లో పాల్గొన్నారు. ఫైవ్ డీ థియేటర్‌లో మూవీని చూశారు.కార్యక్రమంలో నీతిఅయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్‌కుమార్, యంగ్‌ప్రొఫెషనల్ ఇంద్రజిత్‌కుమార్, ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


నీతి అయోగ్ లక్ష్యాలను చేరాలి

భామిని: మండలంలోని ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో నీతి అయోగ్ బృందం శుక్రవారం పర్యటించింది.నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్ కుమార్, యంగ్ ప్రొఫెషనల్ ఇంద్రజిత్ కుమార్, ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, మధుసూధన్ బృందం మండలంలోని పాలస్‌కోట, నల్లరాయిగూడ.సన్నాయిగూడ,భామినిలలో పర్యటించారు.నీతి అయోగ్‌లో ఆస్పిరేషన్ బ్లాక్ కింద భామిని మండలం ఎంపిక కావడంతో మండలంలో పీఎం జన్‌మాన్ కార్యక్రమాలపై సమీక్షించారు.నల్లరాయిగూడలో వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని పరిశీలించి సభ్యులతో మాట్లాడారు.ఆదివాసీల తాగునీటి సమస్య,పక్కా గృహాల నిర్మాణాలు, విద్యుత్తు, వైద్య సౌకర్యంపై సమీక్షించారు.

22 నుంచి ఏయూ దూరవిద్య డిగ్రీ తరగతులు ప్రారంభం

విజయనగరం అర్బన్: ఆంధ్రయూనివర్సిటీ దూర విద్య 2024-25 విద్యాసంవత్సరం బ్యాచ్‌లో ఉన్న తెలుగు, ఇంగ్లీష్ మీడియం బీఏ, బీకాం ప్రథమ సంవత్సరం మొదటి, రెండవ సెమిస్టర్స్ వారాంతపు తరగతులు ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తామని ఏయూ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దన నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్త పది రోజుల పాటు నిర్వహించే ఈ తరగతుల తేదీ షెడ్యూల్‌ను ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ వరకు వారాంతపు రోజుల్లో తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా వారి గుర్తింపు కార్డులతో స్టడీ సెంటర్‌కు వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9492021464 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

117 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తూ.. సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ఎస్.కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో బొడ్డవర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి, పక్కా సమాచారంతో 117కిలోల 100 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. బొలెరో వాహనంలో అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఎస్.కోట పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో సీఐ వీఎస్.మూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గురువారం బొడ్డవర చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి ఇద్దరు వ్యక్తులు బొలెరో వాహనంలో గంజాయిని కేరళ రాష్ట్రానికి తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన ఇద్దరు నిందితులను విచారణ చేయగా కేరళ రాష్ట్రానికి చెందిన రామ్ అనే వ్యక్తి ఆదేశాలతో ముందుగా అరకు వచ్చి, అక్కడ వేరే వ్యక్తుల సహకారంతో ఒడిశా రాష్ట్రానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి, ఎవరికీ అనుమానం రాకుండా వాహనం వెనుక భాగాన్ని ఒక అరగా మార్పు చేసి, దానిలో గంజాయిని డంప్ చేసి, కేరళ రాష్ట్రానికి తరలిస్తుండగా పట్టుబడ్డారు. నిందితులిద్దరూ కేరళ రాష్ట్రంలోని త్రిశూర్ జిల్లా చెర్పుకు చెందిన అన్సర్ పీఏ.అలియాస్ పడిక్కవిట్టి అన్సర్ (ఎ-2), అదేవిధంగా ఫిరోస్ కేకే (ఎ-3)లుగా గుర్తించామన్నారు. వారి నుంచి గంజాయి, వాహనం, రెండు మొబైల్ ఫోన్‌లు, రూ.10, 310 నగదు సీజ్ చేశామన్నారు. పట్టుబడిన గంజాయి రూ. 5 లక్షల 58వేల 500 ఉంటుందని ఎస్పీ తెలిపారు. విచారణలో ఈ కేసుతో కేరళ రాష్ట్రానికి చెందిన రామ్‌తో సహా మరో ఇద్దరికి సంబంధం ఉన్నట్లు గుర్తించామని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి, ఎస్బీ సీఐలు ఏవీ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

గజపతినగరం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వద్ద కారు ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓయువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నం నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న కారు గజపతినగరం రైల్వేస్టేషన్ జాతీయ రహదారి వద్ద పురిటి పెంట గ్రామానికి చెందిన బాలి జోగినాయుడిని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన జోగినాయుడిని విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు కారును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిటీబస్సు ఢీకొని వీఆర్‌ఏకు..

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కవరపుకోట తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న కె.మాధవి తీవ్రంగా గాయపడ్డారు. తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన మాధవి విధులకు వెళ్లడానికి నడుచుకుంటూ బ్రిడ్జి వద్దకు వెళ్తుండగా సిటీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



బస్సును ప్రారంభిస్తున్న మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ప్రమాణికుల భద్రతే లక్ష్యంగా రవాణా సేవలను సంస్థ అందిస్తోందని, ఆ దిశగా ఉద్యోగులు పనిచేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. విజయనగరం ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత 10 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. రెండు బస్సులు విజయనగరం నుంచి శ్రీకాకుళానికి, మిగిలినవి అనకాపల్లి, శ్రీకాకుళం డిపోలకు చెందినవి ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ప్రయాణికులు రెండు కళ్లు వంటివారని, ఎటువంటి సమస్యలు వచ్చినా ఆందుకుంటామన్నారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక సంస్థను నిలబెడితే ఆ సంస్థ మనకు భవిష్యత్తును ఇస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలను, నగదు పారితోషికాన్ని మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ దున్నదొర, ఆర్టీసీ ఈడీ విజయకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, డిప్యూటీ సీటీఎం సుధాబిందు, ఉద్యోగులు పాల్గొన్నారు.